



మెరిసిన తారలు

విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సినీతారలు మానస వారణాసి, అనుపమ పరమేశ్వరన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త మీనన్, దివి వద్య నగరంలో సందడి చేశారు. ఆదివారం పోరంకిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ ఉత్సవ్ ఏపీ, ఈవెంట్లకు సంబంధించిన లోగోలను ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 6



దుర్గమ్మ ఆలయానికి తాళం

- చంద్రగ్రహణం సందర్భంగా మూసివేసిన అధికారులు

సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు దుర్గామల్లేశ్వర దేవస్థానం తలుపులను (కవాట బంధనం) మూసివేశారు. గ్రహణం అనంతరం సోమవారం తెల్లవారుజామున యథావిధిగా తలుపులు తెరవనున్నారు. ఆలయం మూసివేయడంలో ఆలయ ఆవరణ, క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. 6

చేనేత.. లేదు చేయూత

పనిలేదు.. ఆరేళ్లుగా రాయితీ లేదు..!

జిల్లాలోని 33 సంఘాల్లో కష్టాలు

చేనేత రంగానికి చేయూత కరువైంది. నేతన్నకు రోజువారీ జీవనం కష్టంగా మారింది. సరిపడా పనిలేక, భవిష్యత్తులో ఉంటుందో లేదో తెలియక.. అనారోగ్య సమస్యలు, అప్పులతో కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత వస్త్రాల తయారీ, అనుబంధ పనులు చేసే కార్మికులను ఆదుకోకపోవడంతో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొన్ని ఉత్పత్తులకు జీఎస్టీని మినహాయిస్తోందని, చేనేత వస్త్రాలకు కూడా ఆ అవకాశం కల్పించాలని నేతన్నలు కోరుతున్నారు.

- చేనేత వస్త్రాలను కొనని ఆప్కో
- అప్పుల ఊబిలో సహకార సంఘాలు
- రోడ్డున పడుతున్న కార్మికులు
- వైసీపీ పాలన నుంచీ ఇదే పరిస్థితి
- జీఎస్టీ పూర్తిగా తగ్గించాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో చేనేత రంగాన్ని పక్కన పెట్టింది. 2018 నుంచి బకాయిలను నిలిపివేసింది. కొన్ని చేనేత కార్మిక కుటుంబాలకే ఏడాదికి రూ.24 వేల చొప్పున ఇచ్చింది. కానీ, రోజువారీ పని కల్పించకపోవడంతో నేతన్నలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో 33 చేనేత సహకార సంఘాలు ఉండగా, పెడన పరిసర ప్రాంతాల్లోనే 23 ఉన్నాయి. ఈ 33 సంఘాలకు రూ.10 కోట్లకు పైగా బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆరేళ్లుగా చేనేత వస్త్రాలకు రిబేటు ఇవ్వకుండా నిలిపివేయడంతో ఈ సంఘాలన్నీ ఆర్థికపరమైన చిక్కుల్లో పడ్డాయి. దీంతో మిగతా 6లో..

పెరగని మజూరీ ధరలు

ఆరేళ్లుగా చేనేత వస్త్రాల మజూరీ ధరలు పెరగలేదని కార్మికులు చెబుతున్నారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ ధరలను పెంచాలని కార్మికులు కోరుతున్నారు. రూ.1,000 ధర పలికే చీరను నేస్తే కార్మికులకు కూలీగా కేవలం రూ.300 మిగులుతోంది. ఇందులో జీఎస్టీ రూ.120 వసూలు చేస్తుండటంతో భారం పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు ఎప్పుడో..

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో ఆ పార్టీకి చెందిన రాజకీయ నిరుద్యోగులకు నామినేటెడ్ పద్ధతిలో ప్రతి ఆరునెలలకోసారి సంఘాల్లో త్రీమెన్ కమిటీల పేరుతో ఉపాధి కల్పించారు. దీంతో పూర్తిస్థాయి పాలకవర్గాలు లేక చేనేత సంఘాల్లో పరిపాలన దాదాపు కుంటుపడింది. వస్త్ర ఉత్పత్తి లేని సమయంలో పాలకవర్గాలు ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడంతో సంఘాలు మూతపడే దశకు చేరుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ఆర్థిక వెసులుబాటు కల్పించాలని, ఈ రంగానికి జవసత్వాలు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.



ఆదుకోని ఆప్కో

చేనేత వస్త్రాలను కొనేందుకు ఆప్కోను ఏర్పాటు చేశారు. అయితే, దీనిద్వారా చేనేత సంఘాల నుంచి వస్త్రాలు కొనట్లేదు. పవర్‌లూమ్స్‌పై తయారైన వస్త్రాలనే కొంటూ బిల్లులు మంజూరు చేస్తోంది. చేనేత వస్త్రాలను తక్కువ మొత్తంలో కొనుగోలు చేసినా బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ ప్రభావం చేనేత సంఘాలపై పడుతోంది. కార్మికులు తయారు చేసిన వస్త్రాలను సర్వశిక్ష ద్వారా కొంటామని ఆప్కో చెబుతోంది.

పామర్రు మండలం జుజ్జవరం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ తదితరులు



తీరని యూరియా వెతలు

సీఎం చంద్రబాబు స్పందించే వరకు కదలని జిల్లా యంత్రాంగం

జిల్లాలో వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ పర్యటన

- కలెక్టర్, జేసీ, ట్రైనీ కలెక్టర్ల విస్తృత తనిఖీలు
- జిల్లాకు మరో 12 వేల టన్నుల యూరియా

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో యూరియా కొరత ఇంకా రైతులను వేధిస్తూనే ఉంది. యూరియా సరఫరాలో నిఘా కొరవడటం, ఎరువుల దుకాణం యజమానులతో వ్యవసాయశాఖ అధికారులకు ఉన్న చీకటి ఒప్పందాలు రైతులను ఈ ఏడాది ఇబ్బందులపాలు చేశాయి. పీఏసీఎస్‌లు, ఎరువుల కంపెనీలకు చెందిన దుకాణాల వద్ద గంటల తరబడి క్యూ కట్టినా యూరియా మాత్రం రైతులకు సరిపడా అందలేదు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ రంగంలోకి దిగాల్సి వచ్చింది.

కలెక్టర్, జేసీ, ట్రైనీ కలెక్టర్ తనిఖీలతో మెరుగుపడేనా!

గత మూడు రోజుల వ్యవధిలో సీఎం చంద్రబాబు రెండు విడతలుగా యూరియా కొరతపై సమీక్ష నిర్వహించారు. కృష్ణాజిల్లాలో రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను మిగతా 6లో..

ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



ఒకే ఊరిలో 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ముగ్గురు

- మిగిలిన వారందరికీ డీఎస్సీలో..
- ఘనంగా సన్మానించిన గ్రామస్థులు

కోడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామానికి చెందిన 15 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అరుదైన ఘటన కోడూరు మండలం లింగారెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని జరుగువానిపాలెం గ్రామంలో జరిగింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ముగ్గురు, మెగా డీఎస్సీలో 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వీరిని లింగారెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కనకదుర్గ, కోడూరు ఎస్ఐ చాణిక్య ఆదివారం ఘనంగా సత్కరించారు. మారుమూల గ్రామంలో రైతు కుటుంబాల్లో పుట్టిన విద్యార్థులు కష్టపడి చదవి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గ్రామానికే గర్వకారణమన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ద్వారా తమ జీవితాల్లో వెలుగులు నింపిందని ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు.

శోభాయమానంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

'విజయ' చైర్మన్ చలసానికి ఘన సత్కారం

టీటీఈలకు బయోమెట్రిక్

6లో

టెండర్లు స్ప్లిట్!

విజయవాడ 'మెట్రో' ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టర్ల అభిప్రాయం

- గంపగుత్తగా కాకుండా పనులను విభజించాలని సూచన
- జాయింట్ వెంచర్‌గా పనిచేయటానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి
- మెట్రో రైల్ ప్రాజెక్టుకు కాంట్రాక్టు సంస్థల నుంచి స్పందన
- బోర్డు మీటింగ్‌లో చర్చించాలని భావిస్తున్న ఏపీఎంఆర్‌సీ
- టెండర్ల ప్రక్రియ అక్టోబరు 14వ తేదీకి వాయిదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మెట్రో రైల్‌ప్రాజెక్టుకు సంబంధించి బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు కారిడార్ల నిర్మాణ పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ నెల 19న టెండర్లు తెరవాల్సి ఉంది. అయితే ఇటీవల ఏపీఎంఆర్‌సీ అధికారులు కాంట్రాక్టు సంస్థలతో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించారు. ప్రీ బిడ్ మీటింగ్‌కు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు హాజరయ్యారు. కాంట్రాక్టర్ల నుంచి ప్రధానంగా రెండు సూచనలు వచ్చాయి. రూ.4,150 కోట్ల విలువతో



గుత్తగా టెండర్లు ఎందుకు పిలవాల్సి వచ్చిందని పలు కాంట్రాక్టు సంస్థలు అడిగినట్టు తెలిసింది. గుత్తగా కాకుండా పనులను స్ప్లిట్ చేయాలన్న ప్రతిపాదనలు పలు కాంట్రాక్టు సంస్థల నుంచి వచ్చాయి. దేశంలో పలు మెట్రో కారిడార్ మిగతా 6లో..

'విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు టెండర్లు స్ప్లిట్ చేయండి.. జాయింట్ వెంచర్లకు అవకాశం కల్పించండి' అంటూ తాజాగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) నిర్వహించిన ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థల నుంచి అభిప్రాయాలు వచ్చాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని రెండు, మూడు రోజుల్లో ఏపీఎంఆర్‌సీ బోర్డు సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశంలో కాంట్రాక్టు సంస్థల సూచనలపై చర్చించాలని భావిస్తోంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి కాంట్రాక్టు సంస్థల అభిప్రాయాన్ని తెలియపరచనుంది. ప్రీబిడ్ మీటింగ్‌కు కాంట్రాక్టు సంస్థల నుంచి విశేష స్పందన రావడం, కీలకమైన అంశాలపై వారు చర్చ పెట్టడంతో టెండర్లను అక్టోబరు 14వ తేదీ నాటికి వాయిదా వేసింది.



బెజవాడ గ్రాండ్ హైవే డీపీఆర్‌లు రెడీ!

మచిలీపట్నం నుంచి విజయవాడ వరకు ఒకటి..

- హైదరాబాద్ నుంచి విజయవాడకు మరొకటి సిద్ధం
- ఈ నెలలోనే ఎన్‌హెచ్–65 అధికారులకు చేరనున్న డీపీఆర్‌లు
- అక్కడి నుంచి కేంద్ర ప్రభుత్వానికి.. వేగంగా హైవే ప్రక్రియ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడకు గ్రాండ్ హైవేగా ఉన్న మచిలీపట్నం - హైదరాబాద్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-65 ఆరులేన్ల విస్తరణ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)లు ఈ నెలలోనే జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)కు చేరనున్నాయి. ఎన్‌హెచ్ - 65పై ఆరు లేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రెండు డీపీఆర్‌లకు నిర్దేశించింది. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ మార్గంలో అత్యంత ప్రధానమైనదిగా ఎన్‌హెచ్-65 నిలుస్తోంది. ఎన్‌హెచ్ - 65ను బందరు పోర్టు అవసరాల దృష్ట్యా మచిలీపట్నం నుంచి విజయవాడ వరకు ఆరు లేన్లుగా విస్తరించేందుకు ఒక డీపీఆర్‌ను సిద్ధం చేశారు. అలాగే హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు ఆరు లేన్లుగా విస్తరించటానికి రెండవ డీపీఆర్‌కు నిర్దేశించారు. ఈ రెండు డీపీఆర్‌లు కూడా దాదాపుగా పూర్తయ్యాయి.

హైదరాబాద్ - విజయవాడ ఆరు వరసల విస్తరణ డీపీఆర్ తెలంగాణలోని ఎన్‌హెచ్ అధికారులకు ఈ నెలలోనే సమర్పించనున్నారు. ఈ పాటికే డీపీఆర్‌ను సమర్పించాల్సి ఉన్నా.. విజయవాడతో ముడిపడి ఉన్న కొన్ని సమస్యల రీత్యా ఆలస్యమైంది. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు వరకు మాత్రమే ముందుగా దీనిని ప్రతిపాదించారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ఇంకా ఏర్పడలేదు. హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి అమరావతి ఓఆర్ఆర్ వరకే ప్రతిపాదించిన విషయాన్ని మిగతా 6లో..



శోభాయమానంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చి బలిహరణలు సమర్పించారు. ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యుడు శివప్రసాద శర్మ, శ్రీనివాసశాస్త్రి, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య మేళతాళాలు, తప్పెట వాయిద్యాలుతో గిరిప్రదక్షిణ ప్రారంభమైంది. వీధుల్లో భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు తదితరాలను సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం కింద పాయసాన్ని అందజేశారు. వందలాది భక్తులు గిరిప్రదక్షణలో పాల్గొన్నారు.



జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులకు, సినీహీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ జ్యోతిర్మయి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఈవో శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీస్సుల అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

టీటీఈలకు బయోమెట్రిక్ అమలు



రైల్వేస్టేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టికెట్ చెకింగ్ యాక్టివిటీలో మరింత పారదర్శకత, రియల్ టైమ్‌ను అమలు చేయటంలో భాగంగా ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్లకు బయోమెట్రిక్ విధానంలో హాజరును అమలు చేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్‌లోని సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ సెక్షన్‌లలో బయోమెట్రిక్‌ను పరిచయం చేస్తున్నట్టు తెలిపారు. ఇదే విధానాన్ని జోన్‌లోని మిగతా 73 టీటీఈ లాబీలకు విస్తరించనున్నట్టు తెలిపారు. ఇంతకుముందు టికెట్ చెకింగ్ స్టాఫ్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లను వినియోగించి సైన్ ఆన్, సైన్ ఆఫ్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీనిస్థానంలో లాగిన్ మెకానిజాన్ని ఒక సరైన విధానంలో తీసుకురావటానికి గాను ఆధార్ ఆధారిత బయోమెట్రిక్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. ఫింగర్ ప్రింట్ డివైజ్ టీటీఈ లాబీలలో, సీ-డాక్ పోర్టర్‌తో అనుసంధానమై ఉంటుందని తెలిపారు. దీనివల్ల టీటీఈలు భౌతికంగా వారి వారి స్టేషన్‌ల్లో ఉన్నట్టుగా నిర్ధారణ అవుతుందన్నారు. వారు వాస్తవంగా ఉండే స్టేషన్‌గాని, లేకపోతే వారు ప్రయాణించి వేచి ఉన్న స్టేషన్ దగ్గర కాని ఈ బయోమెట్రిక్‌ను వినియోగించాలని తెలిపారు. వీరి హాజరును రియల్ టామ్‌లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. జోన్‌లో సాంకేతికతను వినియోగించి బయోమెట్రిక్ అమలు చేయటం అభినందనీయని సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయకుమార్ శ్రీవాస్తవ అన్నారు. దీనివల్ల పారదర్శకత పూర్తి స్థాయిలో ఉంటుందని ఆయన తెలిపారు.

'విజయ' చైర్మన్ చలసానికి ఘన సత్కారం



ఆంజనేయులును సత్కరిస్తున్న జర్నలిస్టు నేతలు

గాంధీనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విజయా డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు పాడి రైతులకు ఎనలేని కృషి చేస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. కృష్ణా మిల్క్ యూనియన్‌లో రైతుల కోసం ఆయన పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతుల మన్నలను పొందుతున్నారన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులను జర్నలిస్టు నేతలు ఘనంగా సత్కరించారు. చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. యూనియన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ శర్మ, నారాయణ్ తివారీ, బడే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ గ్రాండ్ హైవే డీపీఆర్‌లు రెడీ

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్న విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని జిల్లా యంత్రాంగంతో కలిసి తెలంగాణ ఎన్‌హెచ్ అధికారులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు వరసల విస్తరణ పనులను ఇబ్రహీంపట్నం మీదుగా గొల్లపూడి బైపాస్ వరకు పొడిగించాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి గడ్కరీ అమరావతి వచ్చిన సందర్భంలో ఏకంగా గొల్లపూడి నుంచి ప్రస్తుత కనకదుర్గ ఫ్లై ఓవర్ ల్యాండ్ అయ్యే హరిత బరం పార్కు వరకు పొడిగించేలా ఆయన్ను ఒప్పించి మరీ ప్రకటన చేయించారు. ఈ కారణాల వల్ల డీపీఆర్ తయారీలో కొంత జాప్యం జరుగుతోంది. ఈ నెలాఖరు నాటికి హైదరాబాద్ - విజయవాడ ఆరు లేన్ల విస్తరణ డీపీఆర్‌ను ఎన్‌హెచ్ అధికారులకు సమర్పించే అవకాశం ఉంది. అలాగే ఎన్‌హెచ్ - 65పై విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు కూడా ఆరు లేన్ల విస్తరణకు డీపీఆర్ నిర్దేశించారు. ఈ డీపీఆర్‌ను కూడా కన్సల్టెన్సీ సంస్థ తయారు చేసింది. మచిలీపట్నం పోర్టు అనుసంధాన రోడ్డు నుంచి పోరంకి వరకు ఆరు వరసలుగా, పోరంకి నుంచి కానూరు వరకు నాలుగు వరసలుగా సర్వీసు రోడ్లతో ఉండేలా ప్రతిపాదించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి మేరకు అమరావతికి గడ్కరీ వచ్చిన సందర్భంలో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. వారం రోజులలో ఎన్‌హెచ్ అధికారులకు డీపీఆర్ అందనుంది. డీపీఆర్‌లు ఎన్‌హెచ్ అధికారులకు అందగానే.. వెంటనే వీటిని కేంద్ర ఎన్‌హెచ్ అధికారులకు పంపిస్తారు. ఫైనాన్షియల్ గ్రాంట్ ఇచ్చి .. టెండర్లు పిలవమనగానే.. స్థానికంగా విస్తరణ పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.



విజయవాడ ఉత్సవ్ ఏవీ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, చిత్రంలో ప్రజా ప్రతినిధులు, సినీప్రముఖులు

తళుక్కుమనేలా..

విజయవాడ ఉత్సవ్ ఏవీ ఆవిష్కరణ



విజయవాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒక ఉత్సవం.. అనేక ఈవెంట్లు.. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో ప్రత్యేకత.. విజయవాడ ఉత్సవ్ స్పెషల్ ఇది.. ఈనెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీవరకు నిర్వహించే విజయవాడ ఉత్సవ్ ఏవీ ఆవిష్కరణతోపాటు ఈవెంట్లకు సంబంధించిన లోగోల ఆవిష్కరణ కార్యక్రమం పోరంకిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యేలు శ్రీరామతాతయ్య, తంగిరాల సౌమ్య, బోడె ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు. ఏవీ ఆవిష్కరణలో కిష్కిందపురి ట్రయలర్స్‌ను ప్రదర్శించారు. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నటి అనుపమ పరమేశ్వరన్ నటించిన ట్రయలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఇవీ ఆవిష్కరణలు

విజయవాడ ఉత్సవ్ ట్రైలర్, విజయవాడ ఉత్సవ్ వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్ లాంచ్, విజయవాడ ప్రీమియర్ లీగ్ ప్రోమో, లోగో ఆవిష్కరణ, విజయవాడ ఉత్సవ్ మర్కంటైజ్, విజయవాడ ఉత్సవ్ ఏఐ క్యారెక్టర్ లాంచ్, స్వచ్ఛథాన్ - మారథాన్, హెలికాప్టర్ రైడ్ పోస్టర్ ఆవిష్కరణ, ఎక్స్‌పో లాంచ్

మైసూరు ఉత్సవాలను తలదన్నేలా.. : ఎంపీ శివనాథ్

విజయవాడ ఉత్సవ్‌ను మైసూర్ ఉత్సవాలను తలదన్నేలా నిర్వహిస్తాం. శరన్నవరాత్రులు, విజయవాడ ఉత్సవ్ విజయవాడ చారిత్రక వైభవాన్ని చాటి చెప్పడానికి ఇదొక మంచి అవకాశం. కళలకు, కళాకారులకు పుట్టినిల్లు విజయవాడ. వాటిని మళ్లీ వెలికి తీస్తాం. ఆరు ప్రాంతాల్లో ఈవెంట్లు నిర్వహిస్తాం. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పశ్చిమ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. ఉత్సవ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఫ్లాష్‌మాబ్‌ను నిర్వహిస్తాం.

ఉత్సవ్‌కు వస్తా : బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఈనెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జరిగే విజయవాడ ఉత్సవ్‌కు కచ్చితంగా హాజరవుతా. ఇందులో ఎంజాయ్ చేస్తా. విజయవాడ ఉత్సవ్ ఏవీని ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉంది.

దసరా ఉత్సవ్-2025 వెబ్‌సైట్ లాంచ్

- కళా ప్రదర్శనలు, మిస్ విజయవాడ, విజయవాడ ఐడల్, విజయవాడ మారథాన్..
- పాల్గొనదలచినవారు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు
- టికెట్లు బుక్ చేసుకోవటానికి కూడా అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ఉత్సవ్-2025 గ్రాండ్ ఈవెంట్ కోసం నిర్వాహక కమిటీ వెబ్‌సైట్ రూపకల్పన చేసింది. కార్యక్రమంలో భాగంగా విజయవాడలో నిర్వహించే కార్యక్రమాలు, వేదికలు సమగ్రంగా పొందు పరిచారు. ఉత్సవ్‌లో పాల్గొనే సెలబ్రిటీలు, కళాకారులు ప్రదర్శించే అంశాలు, మెగా కార్నివాల్, ఫైర్ వర్క్స్, స్కిల్ డెవలప్‌మెంట్, మెగా మారథాన్, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ధాండియా నైట్స్ గురించి పొందు పరిచారు. అలాగే ప్రధాన వేదికలైన తుమ్మలపల్లి కళాక్షేత్రం, గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్, పున్నమిఘాట్, ఘంటసాల సంగీత కళాశాల, ఎంజీ రోడ్ కార్నివాల్‌లో ప్రదర్శించే అంశాలను పొందు పరిచారు. కార్యక్రమాలకు సంబంధించి కొన్నింటికి ఎంట్రీ టిక్కెట్స్‌ను నిర్ణయించారు. టిక్కెట్స్‌ను బుక్ చేసుకోవటానికి వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. స్టూడెంట్ వలంటీర్ ప్రోగ్రామ్ కింద దరఖాస్తు చేసుకునే యువతీయువకులకు ఆహ్వానం కల్పించింది. దసరా ఉత్సవ్ - 2025 మెగా ఈవెంట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు, స్పాన్సర్‌షిప్‌కు, ప్రదర్శనలకు కళాకారులు కానీ, బ్రాండ్ ఆక్టివేషన్ కార్యక్రమాలకు, ఫుడ్ స్టాల్ రిజిస్ట్రేషన్, మీడియా యాక్సెస్, వలంటీర్ రిజిస్ట్రేషన్ వంటి వాటికి అవకాశం కల్పించారు. విజయవాడ ఐడల్, మిస్ విజయవాడ వంటి వాటి కార్యక్రమాలలో పాలు పంచుకోదలచిన వారు కూడా వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి అవకాశం కల్పించారు.



పామర్రు పరిధిలో కంచర్లవానిపురం వద్ద రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న అధికారులు

రైతుల అవసరం మేరకు యూరియా

- కృష్ణా జిల్లా పర్యటనలో రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్



రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, పక్కన కలెక్టర్ బాలాజీ

పామర్రు/గూడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగుకు అవసరం మేరకే రైతులు యూరియాను వినియోగించుకోవాలని, మోతాదుకు మించి వినియోగించడం వల్ల భూసారం దెబ్బతినడంతోపాటు, కేన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయని రైతులు గ్రహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం యూరియా సరఫరాపై రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పామర్రులో పర్యటించారు. ఈ సందర్భంగా యూరియా సరఫరాలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చివరి దశలో పంటను కాపాడుకునేందుకు అవసరమైన యూరియాను ఎకరాకు ఒకబ్యాగు చొప్పున అందించాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల పంటకు నష్టమేకాకుండా భూసారం దెబ్బతినడంతోపాటుగా కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కుగా ఉంటుందని ఆయన రైతులకు సూచించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. రైతులకు ఆదాయం పెరుగుతుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు యూరియా అందించడం జరుగుతుందని ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. సాగులో నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను క్షేత్రస్థాయి అధికారులపై ఉందని రాజశేఖర్ ఆదేశించారు. గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను బి.రాజశేఖర్ ఆదివారం సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మూడో డోసుకు ఎవరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, వ్యవసాయశాఖ జాయింట్ డైరక్టర్ నూతలపాటి పద్మావతి, ఏడీఏ బి.స్వర్ణలత, ఏవోలు సి.శాంత, వి.శివనాగరాణి, వీపీఏ షెబానా, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండవ వెంకటకృష్ణారావు, పసుపులేటి నాగా, పసుమర్రు గ్రామ సర్పంచ్ కాకినాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు స్ప్లిట్!

(5వ పేజీ తరువాయి)

పనుల్లో రూ.300 కోట్లు ఆపైన కూడా స్ప్లిట్ చేసి నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారన్న విషయాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. దీనిపై ఏపీఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి వివరణ ఇచ్చినట్టు సమాచారం. దేశంలో పలుచోట్ల స్ప్లిట్ చేసి టెండర్లు పిలిచిన మాట వాస్తవమేనని, అలా చేయటం వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతున్న ఉదంతాలను ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో 2028 నాటికి పూర్తి చెయ్యాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నట్టు తెలిపారు. ప్రీబిడ్ మీటింగ్‌లో పాల్గొన్న మరికొన్ని సంస్థలు సింగిల్‌గా కాకుండా జాయింట్ వెంచర్ (భాగస్వామ్య కాంట్రాక్టు సంస్థలు)కు కూడా అవకాశం కల్పించాలని కోరాయి. ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టు సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొనటం ఒక ఎత్తు అయితే... వాటి నుంచి వచ్చిన సూచనలు కూడా యూనిఫామ్‌గా ఉండటంతో వీటిపై బోర్డు మీటింగ్‌లో చర్చించాలని నిర్ణయించారు. బోర్డు మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకు వెళ్లనున్నారు. ఈ నెల 19 నుంచి అక్టోబరు 14 వరకు టెండర్ల గడువును పొడిగించారు.

కేంద్రం నుంచి అనుమతులు రావాలి!

విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు రాలేదు. అధికారిక అనుమతుల కోసం ప్రతిపాదన వెళ్లింది. ఈ ప్రతిపాదన మేరకు ఇటీవల ట్రాఫిక్ స్టడీ నిర్వహించారు. మెట్రో ప్రాజెక్టు పనులలో జాప్యం జరగకూడదన్న ఉద్దేశ్యంతోనే ముందుగా ఏపీఎంఆర్‌సీ టెండర్లు పిలిచింది. టెండర్లు ఖరారు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వ అనుమతులు కావాల్సి ఉంది. ఇటు ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్టర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, అటు కేంద్రం నుంచి అనుమతులు ఇంకా రాకపోవటాన్ని దృష్టిలో పెట్టుకుని టెండర్ల గడువును మరి కొంత కాలం వాయిదా వేశారు.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అనుమతుల కోసం ఎదురుచూపులు

విజయవాడలో మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 6.5 కిలోమీటర్ల నాలుగు వరసల ఫ్లైఓవర్ మంజూరైంది. మెట్రో కారిడార్ కారణంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.5 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను నిర్మించాలన్న ప్రతిపాదన ఏపీఎంఆర్‌సీ నుంచి వచ్చింది. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.1800 కోట్ల వ్యయం అవుతుందని ఇప్పటికే డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపారు. దీనికి సంబంధించి కూడా ఇంకా అనుమతులు రాలేదు. ప్రాజెక్టులో జాప్యం జరగకుండా ఉండేందుకు ఏపీఎంఆర్‌సీ అన్ని ప్రయత్నాలను చేసింది. మెట్రో రైల్ అనుమతులతో పాటు , డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు కూడా అనుమతులు ఒకేసారి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

చేనేత.. లేదు చేయూత

(5వ పేజీ తరువాయి)

సొసైటీల మూలధనం నుంచి నగదు తీసి సిబ్బంది జీతభత్యాలు, సంఘాల నిర్వహణ కోసం ఖర్చు చేస్తున్నారు. ఆరేళ్లుగా సొసైటీల్లో నిల్వ ఉన్న వస్త్రాలు మార్కెటింగ్‌కు నోచుకోవట్లేదు. దీంతో నిల్వలు పేరుకుపోయి సంఘాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఈ కారణాలతో సంఘాలు కార్మికులకు పని కల్పించలేకపోతున్నాయి.

నేతన్నల డిమాండ్లు ఇవీ..

- చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. ఆప్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటుచేసి సర్వస్వతంత్ర వ్యవస్థగా గుర్తింపు ఇవ్వాలి. అన్ని జిల్లాల్లో ఆప్కో విక్రయశాలలు ఏర్పాటుచేసి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్‌ను పెంచేందుకు రిబేట్‌ను ఇవ్వాలి. కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించిన బకాయిలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలి. షెడ్డు కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి.
- చేనేత సహకార సంఘాలు తీసుకున్న రుణాలకు పావలా వడ్డీ, యార్న్ కొనుగోలుపై సబ్సిడీ ఇవ్వాలి. రంగు, రసాయనాలు తక్కువ ధరకు అందించాలి. చేనేత సహకార సంఘాల్లో పనిచేసే కార్మికుల కోసం ఏర్పాటుచేసిన త్రిఫ్టఫండ్ పథకాన్ని పటిష్టంగా అమలుచేయాలి. చేనేత సహకార సంఘాల వార్షిక టర్నోవర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మార్కెటింగ్ ఇన్సెంటివ్‌ను అమలు చేయాలి.
- చేనేత వృత్తి పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపును పెంచాలి. చిలపనూలుపై, చేనేత వస్త్ర ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాలి. స్టేట్ వీవర్స్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి. పవర్‌లూమ్స్, టెక్స్‌టైల్ మిల్లులు చేనేత వస్త్రాలను తయారుచేయకుండా ఆంక్షలు విధించాలి. చేనేత మగ్గాలపైనే వస్త్రాలు తయారుచేసేలా చర్యలు తీసుకుని కార్మికుల ఉపాధి మెరుగుపరచాలి. అర్హులైన కార్మికులందరికీ ఏటా రూ.25 వేలు ఇవ్వాలి.

ఆర్టీసీ పదోన్నతులు ఎప్పుడు!

- జీవో విడుదల జాప్యంపై ఉద్యోగుల అసంతృప్తి
- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ జీవో విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని, దీని వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. మచిలీపట్నంలో ఓ హోటల్‌లో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు మాట్లాడుతూ, ఆరేళ్లుగా నిలిచిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు ఆగస్టు 28న సీఎం చంద్రబాబు అనుమతులు ఇచ్చినా సంబంధిత అధికారులు జీవో జారీ చేయకపోవడం పట్ల 6వేల మంది ఉద్యోగులు నిరుత్సాహానికి గురవుతున్నారన్నారు. వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ, స్త్రీ శక్తి పథకం మరింత విజయవంతం కావాలంటే మరో మూడువేల బస్సులు కొనుగోలు చేయడంతోపాటు 10 వేలమంది సిబ్బందిని రిక్రూట్ చేయాలన్నారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండి ప్రసాద్, విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, జోనల్, జిల్లా కమిటీ నాయకులు, ట్రాఫిక్ గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ (ఉయ్యూరు), వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా శ్రీహరి (అవనిగడ్డ), చీఫ్ వైస్‌ప్రెసిడెంట్‌గా టీవీ కోటేశ్వరరావు (గన్నవరం), జిల్లా కార్యదర్శిగా వైవీ రావు (మచిలీపట్నం), కోశాధికారిగా కె.వి.ఎస్. రావు (ఉయ్యూరు), ప్రచార కార్యదర్శిగా ఎస్.ఎస్. నెహ్రూ (డిపిటిఓ ఆఫీసు)లు ఎన్నికయ్యారు.

తీరని యూరియా వెతలు

(5వ పేజీ తరువాయి)

నివారించేందుకు కలెక్టర్ బాలాజీకి పలు సూచనలు చేశారు. దీంతో గత మూడురోజులుగా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, ట్రైనీ కలెక్టర్ ఫర్హీద్‌జాహిద్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కలసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో యూరియా ఇంకా రైతులకు అందుబాటులోకి రాలేదు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడిన సమయంలో వెదజల్లే పద్ధతిలో వరినాట్లు వేసిన పొలాల్లో వర్షాభావం కారణంగా కలుపు అధికంగా పెరిగిందని, కలుపు తీసేముందుకు అదనపు కోటాగా యూరియాను జల్లాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. ఉంగుటూరు, గన్నవరం బాపులపాడు మండలాల్లో కలెక్టర్ పర్యటించిన సమయంలో రెండో కోటాగా కాంప్లెక్స్ ఎరువులతో కలిపి ఎకరానికి 25 కిలోల యూరియాను జల్లుతామని, యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందుల పాలవుతున్నామని రైతులు వివరించారు. ఎకరం, రెండెకరాలు సాగు చేసే రైతులకు ఒక యూరియా కట్ట ఇస్తున్నారని, ఐదు ఎకరాలకుపైగా సాగుచేసే రైతులకు కూడా రెండు కట్టల యూరియాకు మించి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌లకు వెళితే అసలు రైతులకు సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకాల జిరాక్సు కాపీలను తెచ్చుకోవాలని సూచిస్తున్నారని, కొందరు రైతులు భూమికి సంబంధించిన జిరాక్సు పత్రాలు ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఇదిలా ఉంటే గతేడాది ఎంతమేర యూరియాను ఇండెంట్ పెట్టామో, ఈ ఏడాది అంతే మొత్తంలో యూరియాను రప్పించామని మండల స్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. వచ్చిన యూరియాను సక్రమంగా విక్రయిస్తే కొరత వచ్చేది కాదని, కానీ కొందరు యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయించడంతోనే యూరియా కొరతకు కారణమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది, ఏమైనా జిల్లాలో యూరియా పూర్తిస్థాయిలో రైతులకు అందేందుకు మరో వారం రోజులు పట్టనుంది.

అరకొరగానే సరఫరా!

ఉదాహరణకు మచిలీపట్నం సౌత్ మండలం నెలకుర్రు పీఏసీఎస్ పరిధిలో 13 గ్రామాలు ఉన్నాయి. శనివారం ఈ పీఏసీఎస్‌కు 440 కట్టల యూరియాను ఇచ్చారు. 300 మంది రైతులకు ఈ యూరియాను పంపిణీ చేయగా, మరో 300 మంది రైతులు యూరియా అందక తిరిగి వెళ్లిపోయారు. మచిలీపట్నం సబ్‌డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం పరిధిలో మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాలు ఉన్నాయి. ఈ కార్యాలయంలో ఏడీఏ పోస్టు ఖాళీగా ఉంది. బంటుమిల్లి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏగా వ్యవహరిస్తున్నారు. తొలుత బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు యూరియా ఇస్తూ, ఆఖరులో మచిలీపట్నం సబ్‌డివిజన్‌కు నామమాత్రంగా యూరియాను ఇస్తున్నారని మచిలీపట్నం, గూడూరు, పెడన మండలాల రైతులు అంటున్నారు.

జిల్లాకు 12వేల టన్నుల యూరియా

రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ జిల్లాలోని పామర్రు, గూడూరు మండలాల్లో కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాకు ఇప్పటికే తొమ్మిది వేల టన్నుల యూరియా కావాలని కలెక్టర్ కోరారని, రైతుల ఇబ్బందులను తొలగించేందుకు మరో మూడు వేల టన్నుల యూరియా అదనంగా కావాలని కోరుతున్నారని, మొత్తంగా 12వేల టన్నుల యూరియాను జిల్లాకు ఇస్తామని చెప్పారు. అయా మండలాల్లో సాగు విస్తీర్ణం, ఇప్పటి వరకు ఇచ్చిన యూరియా లెక్కలను పరిగణనలోకి తీసుకుని యూరియా అవసరాలను గుర్తించి ప్రాధాన్యతాక్రమంలో సరఫరా చేస్తామని వివరించారు. వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, వ్యవసాయశాఖ ఏడీ మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	131, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

విశాఖ వెళ్లే ఇండిగో విమానం గన్నవరంలో ల్యాండింగ్

గన్నవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రతికూల వాతావరణం కారణంగా ఇండిగో విమానం ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండింగ్ అయింది. ఇండిగో సంస్థకు చెందిన విమానం భువనేశ్వర్ నుంచి విశాఖపట్నానికి 70 మంది ప్రయాణికులతో బయలుదేరింది. విశాఖ చేరుకునే సమయానికి భారీ వర్షం కురుస్తుండటంతో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో విమానాన్ని గన్నవరం విమానాశ్రయానికి మళ్లించారు. దీంతో మధ్యాహ్నం 1.52 గంటలకు విమానం ఇక్కడ దిగింది. గంట తరువాత విమానం తిరిగి విశాఖపట్నం బయలుదేరి వెళ్లింది.

రైతులూ అధైర్యపడొద్దు.. అందుబాటులోనే యూరియా

కలెక్టర్ డీకే బాలాజీ



పురుషోత్తపట్నం సొసైటీలో యూరియా సరఫరాపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

గన్నవరం/ఉంగుటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, నిరంతరం సరఫరా జరుగుతుందని రైతులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆదివారం పురుషోత్తపట్నంలో పర్యటించి రైతులతో ముఖాముఖి మాట్లాడి యూరియా స్థితిగతులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గత ఖరీఫ్ సీజన్లో 27వేల మెట్రిక్ టన్నుల యూరియా అందించామని, ఈ ఏడాది అంతకంటే ఎక్కువ పంపిణీ చేశామన్నారు. పురుషోత్తపట్నంలో రైతులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, నక్క శ్రీనివాసరావు యూరియా సరఫరాలో ఒక ఎకరా ఉన్న రైతుకు, 50 ఎకరాలున్న రైతుకు ఒకేలా ఒక బస్తా ఇవ్వడం సరిపోదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సోమ, మంగళవారాల్లో యూరియా లోడ్లు వస్తాయని, అందరికీ సరఫరా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పురుషోత్తపట్నం, కొండపావులూరు మార్గంలో ఊర చెరువు నుంచి నీరు పొంగి కాజ్వేపై పారుతూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోందని, ద్విచక్ర వాహనాలు పడిపోతున్నాయని, ముస్తాబాద్ రహదారి పక్కన కాలువ మట్టి కోతకు గురవుతోందని బీజేపీ నేత నాదిండ్ల మోహన్ తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గుడివాడ ఆర్డీవో జీ బాలసుబ్రహ్మణ్యం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, వ్యవసాయ శాఖ ఏడీఏ సునీల్, తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టీ స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్, పురుషోత్తపట్నం సర్పంచ్ మాదాల రోహిణి పాల్గొన్నారు.

యూరియా సరఫరా నిరంతర ప్రక్రియ

పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని పెద అవుటపల్లిలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలోని పీఏసీఎస్‌లో రైతులకు యూరియా పంపిణీని పరిశీలించారు. రైతులు మధు, సత్యనారాయణ మాట్లాడుతూ ఎకరాకు మూడు బస్తాలు అవసరమని, ఒక్కటి మాత్రమే సరఫరా చేశారన్నారు. ఇంకా రెండు బస్తాల యూరియా సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. వెంటనే స్పందిస్తూ రెండు రోజుల్లో లోడు వస్తుందని, ధైర్యంగా ఉండాలని సమాధానం చెప్పారు.

మెగా అవుట్‌రీచ్‌పై ఆరా

యూరియా సరఫరాపై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యూరియా స్థితిగతులను వివరించి రైతులకు ఆందోళన చెందవద్దని చెప్పారా లేదా అని కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి రైతులను ఆరా తీశారు. స్థానిక రైతులు సింహాద్రి సుబ్బారావు, పడమట శ్రీదేవి, మరీదు శివయ్య భార్య నాగమణి, ఇళ్లకు వెళ్లి వారితో ఆయన ముఖాముఖి మాట్లాడారు. మెగా అవుట్‌రీచ్ సజావుగా జరిగిందా లేదా అని విచారించారు. సచివాలయ సిబ్బంది వచ్చి చెప్పారని రైతులు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం బాపులపాడు మండలం వీరవల్లి, కానుమోలు గ్రామాల్లో పర్యటించారు. ఉంగుటూరు ఇన్‌చార్జి ఎంపీడీవో జుజ్జు ప్రసాద్, బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణ, పెద అవుటపల్లి పంచాయతీ కార్యదర్శి జంగం యోహాను, పీఏసీఎస్ సెక్రటరీ లోకేశ్వరి, వీఏ నాగేంద్రబాబు, టీడీపీ గ్రామఅధ్యక్షుడు మున్నా రామకృష్ణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

యూరియా అధికంగా వాడటం వల్ల సాగు ఖర్చులు పెరగటమే కాకుండా చీడపీడలు సోకి దిగుబడులు తగ్గుతాయని ఎంపీడీవో టీ స్వర్ణలత రైతులకు సూచించారు. మండలంలోని కొండపావులూరులో ఆదివారం యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు మూడు విడతల్లో 25-30 కిలోలు నాట్లు వేసేటప్పుడు, పిలకలు తొడిగే దశ, చిరుపొట్ట దశలో ఎకరానికి 75-90 కిలోలు వరకూ సరిపోతుందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సాయిబాబు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు: ఆర్డీవో

కంకిపాడు: డివిజన్ పరిధిలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, ఉప్పలూరు గ్రామంలో ఆదివారం ఆమె పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమైన 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

ఉయ్యూరు: మండల పరిధిలో రైతులకు అవసరమైన యూరియా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ కే సురేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం చిన ఓగిరాల, గండిగుంట గ్రామాల్లో పీఏసీఎస్‌ల ద్వారా యూరియా పంపిణీని మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో లోయ శివశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ప్రతి ఎకరాకు నాటువేసినప్పుడు 30 కేజీలు, తరువాత 30 రోజులకు రెండోవిడతగా 30 కేజీలు, 60 రోజులకు 3వ విడత 30 కేజీలు యూరియా సరఫరాకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. చిన ఓగిరాలలో పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు రామకృష్ణ, గండిగుంట లో దండమూడి వెంకటనాగేశ్వరరావు యూరియా పంపిణీ పర్యవేక్షించారు.

పీఏసీఎస్ ద్వారా యూరియా

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల వ్యాప్తంగా యూరియా కొరత లేదని, విడతల వారీగా డిమాండ్ మేరకు ఎప్పటికప్పుడు తెప్పించి పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు రైతులకు వివరించారు. రంగన్నగూడెం, మల్లవల్లి పీఏసీఎస్‌ల పరిధిలో తహసీల్దార్ మురళీకృష్ణ, తిప్పనగుంట, రేమల్లె పీఏసీఎస్ పరిధిలో ఎంపీడీవో జోగేశ్వరరావు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో సమాలోచనలు జరిపారు. రంగన్నగూడెంలో ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ రంగన్నగూడెం, వీరవల్లి ప్రాంతంలో రైతులు చెరుకు, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని ఇప్పటికి 10 టన్నుల యూరియా మాత్రమే పంపిణీ జరిగిందని ఇంకా 50 టన్నుల వరకూ అవసరముందని వివరించారు. టీడీపీ అధ్యక్షుడు ధర్మరాజు తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మదాల శ్రీనివారావు తదితరులు సమస్యలను ఎంపీడీవో జోగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఏవో రంగనాథ్‌బాబు, హెచ్‌వో జోసఫ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్: యూరియా కొరతతో ఆందోళన చెందుతున్న రైతుల్లో ధైర్యం నింపుతూ గ్రామాల్లో ఆదివారం బాపులపాడు మండలంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో కే జోగేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, వ్యవసాయ అధికారి రంగనాథ్‌బాబు, ఉద్యానవన శాఖాధికారి జోసెఫ్ క్లస్టర్ అధికారులుగా వ్యవహరించి అవగాహన కల్పించారు.



రిటైర్డు హెచ్ఎం ఎస్ ఎస్ బ్రహ్మంను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

● గురువులను సత్కరించిన కానూరు పూర్వ విద్యార్థులు

కానూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కానూరు జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. 2001 నుంచి 2025 వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఇక్కడ చదివే కాలంలో గురువులతో తమకున్న అనుబంధం, వారి విద్యాబోధన, ఆటపాటలను గుర్తుచేసుకున్నారు. అనంతరం పాఠశాల రిటైర్డు ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ బ్రహ్మం, పూర్వ ఉపాధ్యాయులు రామకృష్ణతోపాటు పలువురు ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు బొకినాల అజరయ్యతోపాటు విద్యార్థులు, తదతరులు పాల్గొన్నారు.

దేవాలయాల మూసివేత



హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా జంక్షన్‌లోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయాలను తెరవనున్నారు.స్థానిక అభయాంజనేయ స్వామి, వేంకటేశ్వరస్వామి, శివాలయం ఆలయాలతో పాటు చిన్ని చిన్న ఆలయాలు, మందిరాలు మూతపడ్డాయి.

నిమజ్జనానికి వెళ్లిన వినాయకుడు

పెనమలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లిపేటలో ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పాటు చేసిన నవరాత్రుల్లో ప్రత్యేక పూజలందుకొన్న గణపతి ఆదివారం ఘనంగా నిమజ్జనానికి పయనమయ్యాడు. బేతాళ డ్యాన్సులు, కోయ కళాకారుల జానపద నృత్యాలు, చిన్నారుల మురళి కోలాటం, కనక డప్పుల మధ్య సంబరాలతో ఊరేగింపు నిర్వహించారు. స్వామి పెద్ద లడ్డూను వనమాల అంజేశ్వరరావు రూ.95వేలకు, చిన్న లడ్డూను కొంగ నరసమ్మ రూ.31వేలకు వేలంపాటలో దక్కించుకొన్నారు.

కానూరులో రూ. 7.2 లక్షలు పలికిన వినాయకుని లడ్డు



లడ్డూను దక్కించుకొని తీసుకువెళుతున్న రమేష్‌బాబు

కానూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కానూరు గ్రామంలోని పెద్దబావి సెంటర్‌లో వరసిద్ధి వినాయక మహోత్సవం 25వ వార్షికోత్సవం సందర్భంగా వినాయకుని వద్ద ఉంచిన 25 కిలోల లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించగా ఎంవీఆర్ శాన్వి ఇన్‌ఫ్రా సంస్థ అధినేత మాదు రమేష్‌బాబు రూ.7 లక్షల 20వేలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాలో వినాయకుని లడ్డూకి ఎక్కడా వేలంపాటలో ఇంత ధర పలకలేదని నిర్వాహకులు తెలిపారు. స్వామివారి లడ్డూను కమిటీ సభ్యులు మాదు రామకృష్ణ, మురళి, నాగార్జున, చిన్ని తదితరులు రమేష్‌బాబుకు అందజేశారు. లడ్డూకు ఇంతమొత్తంలో ధర పలకడం ఆనందంగా ఉందని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పేదలకు వైద్య సేవలందించడంలో ఆనందం

● అనుమోలు ట్రస్టు అధ్యక్షుడు ప్రభాకరరావు

పెనమలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు, వృద్ధులకు తమ చారిటబుల్ ట్రస్టు తరఫున ఉచితంగా సేవలందిస్తున్నందుకు ఆనందంగా ఉందని ట్రస్టు అధ్యక్షుడు, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు పేర్కొన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో 250 మంది స్థానికులకు క్యాపిటల్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. చెన్నుపాటి శ్రీనివాస్, అన్వర్, రాధ, బొంగరాల అబ్రహాం, బాబి, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

చలో కమిషనరేట్ ధర్నా జయప్రదం చేయాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలు అమలుచేయాలని కోరుతూ ఈనెల 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికసంఘం విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మానికొండలో నిర్వహించారు. కార్మికుల సమస్యలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నేతలు అజ్జీర వెంకటేశ్వరరావు, మహ్మద్ అబ్దుల్ బారీ, సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, గ్రామకమిటీ నేతలు ఏసుబాబు, నాగేశ్వరరావు, నజీర్, కోటివర్ధన్, కమలాకర్, తంబి, రమేష్ పాల్గొన్నారు.

పాతపాడులో ఉచిత వైద్య శిబిరం

విజయవాడ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపాడు గ్రామం సుగాలి కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. రోటరీ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ, సుగాలి గిరిజన సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, వైరల్ జ్వరాలతో పాటుగా, కంటి పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఎన్ నాగరాజు, ఎస్‌కే ఫిరోజ్, గిరిజన సేవా సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం విజయవాడ రూరల్ మండల కార్యాలయ ఆవరణలో జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 15 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా బీ శ్రీనివాసరావు (ఆయుష్ శాఖ), అసోసియేట్ ప్రెసిడెంట్ కే హరిబాబు (అగ్నిమాపక శాఖ), ఉపాధ్యక్షుడిగా వీ వెంకటేశ్వరరావు, జీ సులేమాన్‌రాజు, కోశాధికారిగా వీ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డీవెంకటేశ్వరరావుతో కూడిన 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

ఆదాయ వనరుగా యార్డుల అభివృద్ధి

ఏఎంసీ చైర్మన్ గూడవల్లి



మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ గూడవల్లి నరసింహారావు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గన్నవరం వ్యవసాయ మార్కెట్ ఆధీనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని యార్డులు, చెక్ పోస్టులను కట్టుదిట్టం చేసి మరింత ఆదాయ వనరుగా మార్చడానికి కృషి చేస్తున్నామని మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు తెలిపారు. ఆదివారం బాపులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతు గతంలో కంటే అధిక ఆధాయం ఆర్జించే దిశగా ఎమ్మెల్యే యార్లగడ్డ పర్యవేక్షణలో కమిటీ పనిచేస్తోందన్నారు. ప్రతి వనరుపై కమిటీ డైరెక్టర్ల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు, కార్మికులు, కాటా నిర్వాహకుల సమస్యలు, మౌలిక వసతులుపై సోమవారం సమీక్ష సమావేశం గన్నవరంలో నిర్వహిస్తున్నట్టు తొలుత యార్డులో రైతులు, కాటా నిర్వాహకులు, ముఠా కార్మికులతో విడివిడిగా మాట్లాడి క్రయ విక్రయాల తీరును తెలుసుకున్నారు. అలాగే బాపులపాడు శివాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు గార్లపాటి రాజేశ్వరరావు, ఆర్నేపల్లి రామలక్ష్మి, మున్నంగి శేషగిరిరావు, మేకల స్వాతి, బాణావతుల ఆదియ్య, శివలీల, కోటేశ్వరావు, కార్యదర్శి కిషోర్, స్థానిక కూటమి నేతలు ఆళ్ల గోపాలకృష్ణ, వేముపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికల్యాణి, చలమలశెట్టి రమేష్‌బాబు, వేగిరెడ్డి పాపారావు, ఆర్నేపల్లి సూరిబాబు, పుట్టా సురేష్ ఉన్నారు.

నిరుపేదలకు సాయం చేసేందుకు

దాతలు ముందుకు రావాలి

● యువనేత బోడె వెంకట్రామ్

పెనమలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగేందుకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని యువనేత బోడె వెంకట్రామ్ పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ పోరంకి కార్యాలయంలో పోరంకి, తాడిగడప గ్రామాలకు చెందిన నిరుపేదలు మామిడి దుర్గాభవానీ, బండారు యేసమ్మకు తోపుడు బళ్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, చెన్నుపాటి శ్రీనివాస్, దండమూడి సాయిసుధ, ఇబ్రహీం, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.



చోడవరం గణపతి వద్ద బోడె వెంకట్రామ్, కోయ ఆనంద్

చోడవరం గణపతికి ప్రత్యేక పూజలు..

మండలంలోని చోడవరం కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద యువనేత బోడె వెంకట్రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనంలో పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలపాల శ్రీధర్, దొండపాటి సురేష్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన నివాస్ అకాడమీ విద్యార్థులు

కరాటే పోటీల్లో 14 మందికి పతకాలు

ఉయ్యూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దాచేపల్లి తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఎల్‌రే ఫునకోషి చోటాఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఉయ్యూరుకు చెందిన నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియాకు చెందిన 13 మంది విద్యార్థులు పతకాలు సాధించారు. కుమితే విభాగంలో జే సాయి శ్రీవల్లి, సౌమిన్, జీ గీతిక, ఏ భవ్య, కే పవన్, కే వరసిద్ధిక, నిఖిల్ బంగారు పతాకాలు సాధించారు. జీ సాత్విక్, జే కార్తీక్, ఏ అనన్య, ఎం అనుదీప్ సిల్వర్, ఎం మహాస్విన్, ఎన్ ప్రవీణ్ కాంస్య పతకాలు సాధించారు. కోచ్ డీ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

వేలంపాటలో రూ. 3.50 లక్షలకు లడ్డూ

కంకిపాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఘననాథుడి విగ్రహ ఊరేగింపు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైభవంగా జరిగాయి. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో రైతు బజారు వద్ద వినాయకుడి పందిరిలో ఏర్పాటు చేసిన లడ్డూకు అత్యంత ధర పలికింది. పునాదిపాడు గ్రామానికి చెందిన జోయా గ్రూప్స్ ఫౌండర్, చైర్మన్ రాయవరపు ఆకాష్ రూ.3.50 లక్షలకు పాడుకున్నారు.

శివాలయం ఉత్సవ కమిటీ ఏర్పాటుకు సిద్ధం

● చైర్మన్‌గా పులి, వైస్ చైర్మన్‌గా బోయిన





కంకిపాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శివాలయంలో నిర్వహించే దసర ఉత్సవాలకు కమిటీ చైర్మన్‌గా పులి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన బోయిన నాగరాజు పేర్లు ఖరారయ్యాయి. సుమారు 350 ఏళ్ల చరిత్ర కలిగిన కంకిపాడులోని శివాలయంలో దసరా ఉత్సవాలను ఏటా వైభవంగా నిర్వహిస్తూ వస్తుంటారు. అయితే వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఉత్సవాలను తూతూమంత్రం నిర్వహించి అబాసు పాలయ్యారు. ఈసారి అలాంటి తప్పితాలు జరగకుండా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కమిటీ ఏర్పాటుతో పాటు ఉత్సవాల నిర్వహణ బాధ్యతను టీడీపీ నేతలు తుమ్మలపల్లికి అప్పగించారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీఈ నేతలతో రెండు రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి బీజేపీ దూరంగా ఉండటంతో టీడీపీ, జనసేన పార్టీ నేతలతోనే ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా పులి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా బోయిన నాగరాజుతో పాటు మరో 20 మంది ఉత్సవ కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఉత్సవాల 11 రోజులు పని చేస్తుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132 , 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా కుంకమార్చన చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఐదువేల మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు అమ్మవారికి పాలపొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకుడు

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

● ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్


పెద ఎరుకపాడులో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కవిత

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా అందుబాటులోకి వస్తుందనీ రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని గుడ్లవల్లేరు ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్ రైతులకు భరోసా కల్పించారు. ఆదివారం ఆయన వడ్లమన్నాడులో కార్యదర్శి రమణ, వ్యవసాయ అసిస్టెంట్లతో కలసి రైతుల ఇళ్లకు వెళ్లి యూరియా ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు.

గుడివాడ రూరల్ : మండలంలో యూరియా కొరత లేకుండా సక్రమంగా సరఫరా జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. సెరిదింటకుర్రులో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తదితరులు యూరియా ఎంత వచ్చింది, ఏయే రైతులకు అందజేశామో తదితర విషయాలపై కరపత్రాలను ప్రదర్శించారు.


భట్లపెనుమర్రులో సూచనలిస్తున్న తహసీల్దార్ మస్తాన్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకూ యూరియా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్లూరి రమణ ప్రసాద్, సెరిదింటకుర్రు పీఏసీఎస్ ఛైర్మన్ వీరవరపు ఏసుబాబు, వీరవరపు వంశీ, కూటమి నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు అవసరం కంటే ఎక్కువగా యూరియా వాడవద్దని ఏడీఏ ఎస్.కవిత అన్నారు. ఆదివారం పెద ఎరుకపాడు తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ, సచివాలయాల్లో యూరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ తక్కువ మోతాదులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూరియా వినియోగించుకోవాలన్నారు.ఏవో బోలెం అనంతలక్ష్మీ మాట్లాడుతూ ఐదు రోజుల్లో అందరికీ అందుబాటులో యూరియా ఉంటుందన్నారు.

కూచిపూడి: యూరియా కొరత కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు రెవెన్యూ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించారు. భట్లపెనుమర్రు, పెడసనగల్లు, అయ్యంకి, కూచిపూడి, పెదపూడి తదితర గ్రామాల్లో పర్యటించారు. యూరియా లభ్యత, సొసైటీలకు, ఎరువుల దుకాణాలకు ఎంతెంత వచ్చింది, రానున్న రోజుల్లో ఏ మేరకు ఏయే గ్రామాలకు ఎంత మేర దిగుమతి కానున్న అంశాలపై రైతులకు వివరించారు. అందరికీ యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. ఆర్ఐ విజయదుర్గ పాల్గొన్నారు.

పమిడిముక్కల : కపిలేశ్వపురం, హనుమంతపురం పీఏసీఎస్‌ల వద్ద ఆదివారం యూరియా కోసం రైతులు పడిగాపులు పడ్డారు. కపిలేశ్వరపురానికి 37టన్నుల యూరియా రాగా ఉదయం నుంచి రైతులు పీఏసీఎస్ వద్ద వేచి ఉన్నారు. గ్రామంలో 8,400 ఎకరాల ఆయకట్టు కాగా సరిపడా యూరియా రాకపోవడంతో రైతులు ఎగబడ్డారు. దీంతో ఎకరాకు అరకట్ట చొప్పున 4 కట్టలకు మించకుండా మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి దగ్గర ఉండి పంపిణీచేయించారు. ఆయకట్టుకు సరిపడనంతా యూరియా సరఫరా చేయక పోవడంవల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని పీఏసీఎస్ ఛైర్మన్ బాబూరావు ఆందోళన వ్యక్తంచేశారు. హనుమంతపురంలో ఎకరాకు అరకట్ట చొప్పున పీఏసీఎస్ ఛైర్మన్ రామాంజనేయ ప్రసాద్ పంపిణీచేయించి రైతులకు నచ్చచెప్పారు.


సెరిదింటకుర్రులో ఎరువుల పంపిణీపై పత్రాలు ప్రదర్శిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు


కపిలేశ్వరపురం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు


తాడంకి వద్ద అండర్‌పాస్‌లో ప్రమాదకరంగా గుంతలు

ప్రమాదాలకు నిలయాలుగా అండర్ పాస్‌లు

పమిడిముక్కల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై అండర్‌పాస్‌ల వద్ద గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రహదారిలో తాడంకి అండర్‌పాస్‌లో పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గురజాడ, తాడంకి, కురుమద్దాలి వద్ద అండర్‌పాస్‌లలో, ఇరువైపులా ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు పడి గాయాల పాలవుతున్నారు. మండలంలోని మంత్రివాడ, గోపు వానిపాలెంతో పాటు పొరుగు మండలాల గ్రామాల నుండి ఉయ్యూరు వైపు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలపై తాడంకి అండర్ పాస్ నుంచి వెళ్లవలసిన ఉన్న నేపథ్యంలో వర్షం కురిసినప్పుడు అండర్‌పాస్‌ల్లో నీరు నిలిచి గుంతలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల అధికారులు స్పందించి అండర్‌పాస్‌లు, పక్కన ఉన్న సర్వీసు రోడ్లలో గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.


రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ఎస్.చంటిబాబు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసలై గొడవలకు వెళ్లి రౌడీషీటర్లుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, రౌడీ షీటర్ అనేది మెడల్ కాదని ఎస్సై ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తాలుకా పోలీసుస్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ .ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, అనుమానాస్పద షీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించామని ఎస్సై చంటిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకసాయి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

గుడివాడ : స్థానిక శ్రీకాళహస్తి కాలనీలోని కొత్తగా నిరిస్తున్న శ్రీదుర్గామాత దేవాలయం వద్ద ద్వారకసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఆదివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో 400 మందికిపైగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక గీతాభవన్ రోడ్డులో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, ఉపాధ్యక్షుడు మరీదు శ్రీనివాసరావు, కోశాధికారి లక్ష్మీ, దిల్లేశ్వరరావు దంపతులు, అరుణ, తోట ప్రసాద్, హేమసుందర్‌రావు, సూరాబత్తుల వెంటకలక్ష్మీ, భాగవతుల కల్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు

మాజీ సర్పంచ్ రామలింగారెడ్డి మృతి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లింగవరం మాజీ సర్పంచ్ గాదిరెడ్డి రామలింగారెడ్డి (88) ఆదివారం ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గాదిరెడ్డి రామలింగారెడ్డి 1995లో లింగవరానికి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్ పదవీ కాలం అయిన తర్వాత ఇప్పటి వరకు ఆయన హవానే కొనసాగింది. ఎవరు ఏ పార్టీలో ఉన్నా ఆయన చెప్పిన వ్యక్తులే సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలుపొందారు. ఆవిర్భావంలో ఎన్టీ రామారావు టీడీపీ పెట్టినప్పటి నుంచి టీడీపీకి వెన్నుదన్నుగా ఉన్నారు. తర్వాత మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) వైసీపీ చేరటంతో వైసీపీకిలో మారటం జరిగింది. ఏ పార్టీలో ఉన్నా లింగవరంలో గాదిరెడ్డి రామలింగారెడ్డి హవానే కొనసాగేది. ఈయన భౌతిక కాయాన్ని సందర్శించటానికి వేలాది మంది తరలివచ్చారు. గుడివాడ వర్ల బజారులోని ఆయన స్వగృహంలో మరణించగా, ఆయన సొంత గ్రామం లింగవరం తరలించారు. రాష్ట్ర వైసీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


రామలింగారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించిన మాజీ మంత్రి కొడాలి నాని

ఎట్టకేలకు బెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కూచిపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవిలో మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన బెయిలీ బ్రిడ్జి (ఇనుప వంతెన మరమ్మతులు ఎట్టకేలకు ఆదివారం ప్రారంభమయ్యాయి. బెయిలీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై ఆర్అండ్‌బి శాఖ అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు చేపట్టారు. రెండు, మూడు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి కానున్నాయి. ఈ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించిన నేపథ్యంలో వంతెన ప్లాట్ ఫామ్ దెబ్బతిందని, భారీ వాహనాలు ఈ వంతెనపై వెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వంతెనకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

రెండు దుకాణాల్లో చోరీ

గుడివాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : స్థానిక జీవీఆర్ మాల్ పక్కనే ఉన్న రెండు మందుల దుకాణాల్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి, రూ.2,500లు చోరీకి గురైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం మందుల షాపు పక్కనే ఉన్న టీ స్టాల్ వ్యక్తి మందుల షాపు యజమానికి ఫోన్‌లో సమాచారమివ్వగా వచ్చి చూస్తే షటర్ తాళాలు పగలకొట్టి ఉన్నాయని గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదుకనిపించలేదు. పక్కనే ఉన్న మరో మందుల షాపులో కూడా ఇదే తరహాలో జరిగినట్లు గుర్తించారు. మందుల షాపు యజమాని జె.రజినికాంత్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గణేష్‌బాబు తెలిపారు.

పరిశ్రమల సందర్శనకు ఆదిత్య విద్యార్థులు

గుడివాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఏలూరుజిల్లా, మండవల్లిలోని వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్, పెదపాలపర్రులోని స్టెరిన్ బయో రెమిడీస్ లిమిటెడ్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల బీబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఆదివారం పారిశ్రామిక సందర్శనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు మాట్లాడుతూ పరిశ్రమల సందర్శన వల్ల విద్యార్థులకు పరిశ్రమలు, వాటి నిర్వహణ పట్ల అవగాహన కలుగుతుందన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో పరిశ్రమల సందర్శించ నన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, కామర్స్ విభాగాధిపతి కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ టూర్‌లో పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ సీఎల్.వెంకటరావు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్.వెంకటరావు పేర్కొన్నారు. గుడ్లవల్లేరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్.వెంకటరావు జన్మభూమి మెడికల్ సెంటర్‌లో పలు విభాగాల వైద్యులచే రోగులకు ఉచిత వైద్యసేవలు అందించారు. డాక్టర్ సీఎల్.వెంకటరావు గ్యాస్ట్రోఎంట్రాలజీకి సంబంధించిన వైద్యసేవలు అందించారు. హైదరాబద్‌కు చెందిన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిహరన్ మానసిక రోగులకు, విజయవాడ కామినేని హాస్పటల్స్ వైద్య బృందంచే హృద్రోగ,సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.


రోగులను పరీక్షిస్తున్న హరిహరన్


నగదు అందిస్తున్న రాచూరి ప్రభుదాస్

ఆర్థిక సాయం

పెదపారుపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడ గ్రామంలోని పులవర్తిగూడెంలో 8వ తేదీన మేరీ మాత పుట్టిన రోజు సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో భోజనాల నిమిత్తం పీ4 పథకం ద్వారా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు రాచూరి ప్రభుదాస్ రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో చోరగూడెం కుమార్ బాబు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తులు

గణపతి ఆలయంలో చోరీ

కూచిపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి సంపత్ గణపతి ఆలయంలో హుండీ పగులకొట్టి చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. రెండు నెలల క్రితం ఇదే ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. అప్పట్లో దీనిపై కేసు నమోదయింది. తాజాగా ఆలయ కమిటీ వారు ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు ఆలయానికి సమీపంలోని మద్యం దుకాణాల వద్ద తరచూ మద్యం సేవిస్తూ ఉంటారని, స్థానికులు చెబుతున్నారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో జస్టిస్ హరిహరనాథ్

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.హరిహరనాథ్ శర్మ కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం స్వాగతం పలికా రు. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తికి అందించారు.

యూటీఎఫ్ రణభేరి 15 నుంచి

మచిలీపట్నం టౌన్ : విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

నిత్యాన్నదాన పథకానికి కుర్చీలు, బల్లల వితరణ

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా గుల్లపల్లి గ్రామానికి చెందిన గండే కృష్ణమనాయుడు - మౌనిక దంపతులు 200 కుర్చీలు, 1000 గ్లాసులు, 15 టేబుళ్లు వితరణగా అందజేశారు. ఆదివారం వారు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వారి చిన్నారులు త్రిషిక దేవి, నిహిర దేవిలచే వీటిని ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు అందించారు. దాతలను ఘనంగా సత్కరించారు.

బాలిక కిడ్నాప్

గుడివాడ : స్థానిక జగనన్న కాలనీకి చెందిన బాలిక(15)ను సయ్యద్ ఇమ్రాన్ అనే యువకుడు తీసుకుని పరారైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.శంకరరావు తెలిపారు.


అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

అన్నదాత పోరు రేపు

గుడివాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద జరుగు అన్నదాత పోరు కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం కోరారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోందని, యూరియా కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటే, కూటమి ప్రభుత్వం మాత్రం రైతు సమస్యలపై మొద్దు నిద్ర నటిస్తోందని ఆదాం ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, కందుల నాగరాజు, ఎస్.కె అలీ, అడబాల అప్పారావు, చందూరు శేఖర్, ఘంటా శ్రీనివాసరావు, చింతాడ నాగరాజు, సింహాద్రి రాంబాబు, కొంకితల ఆంజనేయప్రసాద్, షమ్మూ, కాలేషా, మాదాసు వెంకటలక్ష్మీ, ఉమా, సురేఖ, హారిక పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత


కూచిపూడి రామలింగేశ్వరస్వామి ఆలయానికి తాళాలు వేస్తున్న అర్చకులు

కూచిపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మొవ్వ మండలంలో దేవాలయాలు మూసివేశారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటలలోపు అర్చకులు ఆలయాలకు తాళాలు వేశారు. గ్రహణం అనంతరం ఆలయాలను శుభ్రపరిచి సంప్రోక్షణ, అలంకరణ తర్వాత సోమవారం ఉదయం 7 గంటల నుంచి భక్తుల సందర్శనార్థం ఆలయాలను తెరుస్తారు.

గుడ్లవల్లేరు :ఆదివారం రాత్రి చంద్ర గ్రహణం ఉన్నందున మండలంలోని అన్ని దేవాలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచే మూసివేశారు. వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం మధ్యాహ్నం 12.30 గంటలకు దర్శనాలు నిలుపు చేసి ఆలయాన్ని మూసివేశారు. అలానే ఆలయం చుట్టూ పరదాలతో కప్పిమూత వేశారు. కౌతవరం చెన్నకేశవాలయం, గౌతమేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి వారి ఆలయం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి పంచాయుత క్షేత్రం, డోకిపర్రు భూ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఇలా అని గ్రామాల్లో దేవాలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణల అనంతరం ఉదయం 9 గంటల నుంచి భక్తులకు స్వామివార్ల, అమ్మవార్ల దర్శనాలు ఉంటాయని ఆయా దేవస్థానాల నిర్వాహకులు తెలిపారు.


కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి పరదాలు కడుతున్న సిబ్బంది

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545



లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా బిందు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా పంచపర్వాల బిందు ఎన్నికయ్యారు. సువర్ణకళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా బిందు, కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా ఉమా మహేశ్వరరావు ఎన్నికయ్యారు. జి.రామబ్రహ్మం, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, సత్యనారాయణ, దామర్ల శ్రీశాంతి, మిరియాల వెంకటేశ్వరరావు, ఆర్‌కె చౌదరి, వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.



రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత

రైతు కుటుంబానికి బీమా చెక్కు

పెడన రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కవిపురం పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగి ఇటీవల ప్రమాదంలో మరణించిన పుప్పాల మాణిక్యాలరావు కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం అందజేశారు. మరో సభ్యుడు అచ్యుత వీరన్న మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించారు. నందమూరులో నీటిసంఘం అధ్యక్షుడు పరసా నాగరాజుకు గాయాలు కావటంతో కృష్ణప్రసాద్ పరామర్శించారు. నందిగం గ్రామంలో మాతృమూర్తిని కోల్పోయిన టీడీపీ నాయకుడు అనగాని అంకాలరావు తదితరులను పరామర్శించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, గూడవల్లి భద్రాచలం, పుప్పాల శ్రీరామమూర్తి, పుట్టి శ్రీనివాసరావు, పామర్తి వెంకటేశ్వరరావు, యారగాని నాగరాజు, బొల్లా నాగేశ్వరరావు, వీరరాఘవులు, సీఈవో జన్యావుల కృష్ణ పాల్గొన్నారు.

ఇల్లు, బడ్డీకొట్టు దగ్ధం

పెడన, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డులో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలి తాడిశెట్టి సత్యనారాయణకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. సత్యనారాయణ బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పని మీద సత్యనారాయణ బయటకు వెళ్లిన సమయంలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తాటాకు ఇంటితో పాటు దానిని ఆనుకున్న బడ్డీకొట్టు పూర్తిగా కాలిపోయింది.



మాజేరులో రైతులకు యూరియా అందజేస్తున్న ఫర్హీన్ జహీద్



భావదేవరపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్



కోడూరులో ఎరువులు సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కొరత లేకుండా యూరియా అందిస్తాం

• ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ • గ్రామాల్లో యూరియా పంపిణీ పరిశీలన

మోపిదేవి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు యూరియా నిరంతరాయంగా సరఫరా చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ చెప్పారు. కొక్కిలిగడ్డ, పెదప్రోలు పీఏసీఎస్‌లలో యూరియా పంపిణీని తీరును ఆమె పరిశీలించారు. రైతులకు అవసరమైన మేరకు వ్యవసాయ శాఖ సూచనలు అనుసరించి యూరియా సక్రమంగా పంపిణీ చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఏడీఏ జయప్రద, ఏవో హెబ్సిబా రాణి, పెదప్రోలు పీఏసీఎస్ అధ్యక్షులు నాదెళ్ల శరత్ చంద్రబాబు, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, దొప్పలపూడి జగదీష్, కోనేరు నాగేశ్వరరావు, కోనేరు నాని తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి మండలం మాజేరు సొసైటీలో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. సొసైటీకి 20 టన్నుల యూరియా రాగా, గతంలో ఇవ్వని రైతులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి యూరియా అందజేశారు. ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ మాజేరు సొసైటీని సందర్శించి యూరియా పంపిణీని ప్రారంభించారు. గ్రామానికి యూరియా రావటంతో ఉదయాన్నే రైతులు సొసైటీ వద్ద గుమిగూడారు. సొసైటీ ఆధ్వర్యంలో షామియానా, కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. సొసైటీ ఛైర్‌పర్సన్ తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు, సీఈవో ఎస్.ఎస్.చక్రపాణి, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో పరిశ కిరణ్‌కుమార్, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతులకు అవగాహన

చల్లపల్లి : యూరియా కొరత నేపథ్యంలో ఆదివారం అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించారు. ఏవో కె.మరళీకృష్ణ, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఎవి.రమణ మూడు బృందాలుగా కార్యదర్శులు, వీఆర్వోలు, వీఏఏలతో కలిసి గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశమై యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి లక్ష్మీపురంలో ఎరువుల దుకాణాలు తనిఖీచేశారు. యూరియాను అక్రమంగా నిల్వ ఉంచకుండా, ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా రైతులకు అందించాలని స్పష్టంచేశారు. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **ఘంటసాల :** ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ చందు యండకుదురులోనూ, మొవ్వ ఏడీఏ శ్యామల, డిప్యూటీ ఎంపిడివో వెంకటేశ్వరరావు, కొడాలి, చిట్టూర్పు గ్రామాల్లోనూ, చినకళ్లేపల్లి పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయీమ్ చిట్టూర్పులోనూ, పాపవినాశనంలో పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్, సచివాలయ ఉద్యోగులు యూరియాపై అవగాహన కల్పించారు. కొడాలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గుత్తికొండ వరప్రసాద్, కుంపటి చిట్టిబాబు, సచివాలయ ఉద్యోగులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **మోపిదేవి :** యూరియా లభ్యతపై వ్యవసాయ శాఖాధికారి కె.హెబ్సిబా రాణి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిరంతరాయంగా యూరియా పంపిణీ చేయబడుతుందని తెలిపారు. రావి నాగేశ్వరరావు, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, బాల సీతారామ ప్రసాద్, నందిగం శంకరరావు, దిడ్ల జానకి ఉన్నారు. **నాగాయలంక :** భావదేవరపల్లిలో యూరియా కొరత లేదని తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ అన్నారు. భావదేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు యూరియాపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, వీఆర్వో భోగాది వెంకట మల్లిక్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **కోడూరు :** రైతులందరికీ యూరియా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవో సుధా ప్రవీణ్ తెలిపారు. గ్రామాల్లో యూరియాపై అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామన్నారు. యూరియా బదులుగా నానో యూరియా పిచికారి చేసుకోవచ్చన్నారు. ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి ఏడీఏ ఎన్ రమాదేవి ఆదివారం సాతులూరులో ఇంటింట తిగిరి యూరియా వాడకంపై అవగాహనా కార్యక్రమం చేపట్టారు. యూరియాను వ్యవసాయశాఖ సిఫార్సుపై మాత్రమే వాడలన్నారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్ కరుణ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **పెడన రూరల్ :** రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి సజ్జ జెన్నీ అన్నారు. గురివిందగుంట సహకార సంఘంలో రైతులతో మాట్లాడారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రతి రైతుకు యూరియా అందుతుం దన్నారు. ఎంపీడీవో అరుణకుమారి నందమూరు, చోడవరం, మడక గ్రామాలలో పర్యటించి యూరియా పై రైతులకు అవగాహన కల్పించారు. నేలకొండపల్లిలో యూరియా అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరువులు సీజ్

కోడూరు : కోడూరులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఒమర్, మండల వ్యవసాయాధికారి ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో ఎరువుల షాపులు తనిఖీలు చేశారు. శనివారం రాత్రి వరకు కొనసాగించిన తనిఖీల్లో లక్ష్మీ వెంకటేశ్వర ఎరువుల షాపులో నిల్వల్లో తేడాలు కన్పించాయి. దాదాపు రూ.2 లక్షల విలువ గల 13 మెట్రిక్ టన్నులు ఎరువులు సీజ్ చేశారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

మోపిదేవి : మోపిదేవి పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగి ఉండి ఇటీవల మృతి చెందిన నర్రా నారాయణరావు కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఛైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు అందజేశారు. పీఏసీఎస్ సీఈవో మోపిదేవి శ్రీనివాసరావు, ఉప్పాల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరాలయం..

ఘంటసాల జలధీశ్వరస్వామి ఆలయం..

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

మోపిదేవి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి ఆలయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం మధ్యాహ్నం 12.30 నిముషాల నుంచి సోమవారం ఉదయం వరకు ఆలయాలను తాత్కాలికంగా మూసివేసినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. చంద్రగ్రహణం అనంతరం మహా సంప్రోక్షణ నిర్వహించి సోమవారం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించటం జరుగుతుందని తెలిపారు. **ఘంటసాల :** చంద్రగ్రహణం కారణంగా బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయం, భద్రావతి సమేత భవనారుషి స్వామి దేవాలయం, ద్వారకా శ్రీకృష్ణ ఆలయం, పెన్నేరమ్మ దేవాలయాలను ఆదివారం ఉదయం మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం దేవాలయాల తలుపులు తెరుస్తామని ఆయా దేవాలయాల అర్చకులు తెలిపారు. **అవనిగడ్డ రూరల్ :** చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పులిగడ్డలోని అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయం తెరుచుకుంటుందని ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్య తెలిపారు. **కోడూరు :** ఉల్లిపాలెం శ్రీమన్నారాయణస్వామి దేవాలయం, హంసలదీవి వేణుగోపాలస్వామి దేవాలయం, కోడూరు గంగానమ్మ, కనకదుర్గ, విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ఆలయాలు, కోడూరు సాయిబాబా ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకుంటాయని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో జస్టిస్ హరిహరనాథ్

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.హరిహరనాథ్ శర్మ కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తికి అందించారు.



యూటీఎఫ్ రణభేరి 15 నుంచి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, సిహెచ్. రాజశ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ హమీద్, కె. రాజశేఖర్, ఎం. సత్యనారాయణ, శివకుమార్, కె. అర్జున్, సుబ్రహ్మణ్యం, జి. అనంత్, ఎం. ఫణికిరణ్, అడపా శ్రీనివాసరావు, సిహెచ్. శివరామకృష్ణ, పి. పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు రోటరీ సత్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో ఎంతో ఆనందం ఉంటుందని రోటరీ గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ధాత్రి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ గవర్నర్ పాల్గొన్నారు. టీచర్లు ఆర్.వి.రమణ, మైలవరపు అన్నపూర్ణ, మైనేని వెంకట్, అద్దేపల్లి శ్రీనివాస్, మోకా రాజ్యలక్ష్మిలను సత్కరించారు. మచిలీపట్నం రోటరీ క్లబ్ అధ్యక్షుడు లింగం మోజెస్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పేద విద్యార్థికి రూ. 50 వేలను రొటేరియన్ జ్యోతి అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ రమణమూర్తి, ఆకుల సతీష్, కార్యదర్శి ఉదయకిరణ్, అచ్యుతరావు, అజ్మతున్నీసా పాల్గొన్నారు.



కృష్ణకుమారి, స్వప్నలకు కొనకళ్ల అభినందన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, నాటక అకాడమీ ఛైర్మన్ పైడిపాముల స్వప్నను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అభినందించారు. మచిలీపట్నంలో ఆదివారం జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, తలశిల బాలు, మాచవరపు ఆదినారాయణ, కాగిత గోపాలరావు తదితరులు వారిని పాల్గొన్నారు. కొనకళ్ల నారాయణరావు, బుల్లయ్యలను పైడిపాముల కృష్ణకుమారి సత్కరించారు.



చంద్రశేఖరరావు మాస్టారుకు సత్కారం

అవనిగడ్డ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తుంగల చంద్రశేఖర్‌రావు మాస్టారును గరికిపాటి వెంకటేశ్వరరావు (పెద్దోడు) తన కార్యాలయంలో మిత్ర బృందంతో కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నవజీవన్ విద్యాసంస్థల డైరెక్టర్ కొండవీటి ఈశ్వరరావు, కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రావు మాస్టారు నీతి, నిజాయితీతోపాటు నిబద్ధత కలిగి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేశారన్నారు. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చింతలపూడి బాలభాస్కరరావు, గరికిపాటి కృష్ణారావు, వెంకటేశ్వరరావు, మిత్రబృందం పాల్గొన్నారు.

పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క మేట

• పంట భూముల మునక • పూడికతీయాలని రైతుల వేడికోలు

(బంటుమిల్లి - ఆంధ్రజ్యోతి)

పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్ గుర్రపుడెక్క, తూడు, కిక్కిసతో నిండిపోవడంతో పంట భూములు ముంపునకు గురవుతున్నాయి. వర్షాలు పడి పైనుంచి నీటి ప్రవాహం పెరిగినపుడు వేలాది ఎకరాల భూములు ముంపునకు గురి అవుతున్నాయి. డ్రెయిన్ ఆసాంతం గుర్రపుడెక్క, తూడు మేటవేశాయి. మల్లపరాజు గూడెం, నరసప్పచెరువు, సాతులూరు, ఆముదాలపల్లి, జయపురం, చినతుమ్మిడి, పెదతుమ్మిడి గ్రామాల్లో మురుగు కాల్వల నీరు పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో కలవడం వల్ల ముంపు ఏర్పడుతుంది. తుఫానులు, వాయుగుండాలు, అధిక వర్షాలు పడినప్పుడు నీరు కింద వెళ్లక పంట దెబ్బతింటోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నామమాత్రంగా పనులు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. వేలాది ఎకరాలు పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయిన పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్

గత ప్రభుత్వం తూతూమంత్రంగా తూడు తొలగించింది



నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి నీట మునిగింది, చాలా వరకు కుళ్లిపోయింది. ప్రతి సంవత్సరం ఇవే కష్టాలు. అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం తూతూ మంత్రంగా బోట్లతో తూడు తొలగించిమమ అనిపించింది.

- ఏకుల వీరబ్రహ్మం, పెదతుమ్మిడి

శాశ్వత పరిష్కారం చూపాలి



పంట నీటమునిగిన ప్రతి సంవత్సరం తాత్కాలికంగా గుర్రపుడెక్క, తూడు, కిక్కిస తొలగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శాశ్వత పరిష్కార మార్గం చూపట్లేదు. ముంపు సమస్యను పరిష్కరించాలంటే ఏప్రిల్, మే నెలలో పెదతుమ్మిడి ప్రధాన మురికి కాల్వ పూడికతీయాలి. గత 20 సంవత్సరాలుగా శాశ్వత పరిష్కారం చూపకుండా రైతులను తీవ్ర నష్టపరుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెదతుమ్మిడి ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీయించాలి.

- గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు

నిత్యాన్నదాన పథకానికి కుర్చీలు, బల్లల వితరణ



మోపిదేవి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా గుల్లపల్లి గ్రామానికి చెందిన గండే కృష్ణమనాయుడు - మౌనిక దంపతులు 200 కుర్చీలు, 1000 గ్లాసులు, 15 టేబుళ్ల వితరణగా అందజేశారు. ఆదివారం వారు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వారి చిన్నారులు త్రిషిక దేవి, నిహిర దేవిలచే వీటిని ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావుకు అందించారు. దాతలను ఘనంగా సత్కరించారు.

పేద మహిళకు దేవాంగ యూత్ ఆర్థిక సాయం



పెడన, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం దేవాంగ యూత్ సేవా సమితి ఆదివారం రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేసింది. కప్పలదొడ్డి గ్రామానికి చెందిన చేనేత కార్మికురాలు మరకా శ్రీలక్ష్మి గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. సమాచారం అందుకున్న దేవాంగ యూత్ సేవా సమితిదాతల సహకారంతో రూ. 50 వేలు అందించింది. సమితి సభ్యులు ఊటుకూరి సుధీర్, పుచ్చల సుబ్రహ్మణ్యం, బూసం గణపతి, సర్పంచ్ యక్కల నాగరాజు, మాజీ సర్పంచ్ కట్టా మునేశ్వరరావు, మానవత సంస్థ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి పాల్గొన్నారు.